

**ప్రభల తరలింపులో ఉద్రిక్తత**
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల జాతరకు వివిధ గ్రామాల నుంచి రాజకీయ ప్రభలు పోటాపోటీగా తరలివచ్చాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. - 8లో



**కేన్ ప్రాంతాన్ని రక్షించుకోవాలి**
కేన్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వరంగల్ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీధర్ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$39.2^0$ / $22.1^0$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై సమీక్ష



భూపాలపల్లి అర్బన్: జిల్లాలో జరుగుతున్న వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై డీఎంహెచ్‌ఓ మధుసూదన్ శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌లో పలు అంశాలపై చర్చించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, పనితీరు మెరుగుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ రవిరాథోడ్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### త్వరితగతిన క్రమబద్ధీకరణ



భూపాలపల్లి అర్బన్: ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)లో ప్రభుత్వం సూచించిన విధంగా డబ్బులు చెల్లించిన వారి దరఖాస్తులను త్వరితగతిన క్రమబద్ధీకరిస్తూ ప్రొసిడింగ్ కాపీలను అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శనివారం దరఖాస్తుదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సునిల్, సిబ్బంది పాల్గొన్నారు.

### పూస్కుపల్లి క్వారీలో లోకల్ దందా

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీ పరిధి పూస్కుపల్లి ఇసుక క్వారీ వద్ద లోకల్ నాయకుల దందా మొదలైంది. అదే గ్రామానికి చెందిన ఓ అధికారపార్టీ చోట లీడర్ రూ.వెయ్యి తీసుకొని ముందు సీరియల్ ఇప్పించి వసూలు చేస్తున్నారని తెలిసింది. శనివారం సాయంత్రం హైదరాబాద్, రంగారెడ్డి ఇతర పట్టాణాల నుంచి వచ్చిన ఇసుక లారీల డ్రైవర్ల వద్ద అక్రమ వసూలుకు కాంట్రాక్టర్, సంబంధితశాఖ సిబ్బందితో కలిసి తెరలేపినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సాయంత్రం, రాత్రి వేళల్లో గస్తీ లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

### త్వరలో ట్రస్టుబోర్డు నియామకం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం (ట్రస్టుబోర్డు) పాలకమండలి నియామకం ఈనెల చివరి వరకు జరుగనున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 5న దేవాదాయశాఖ నోటిఫికేషన్ వేసి 20 రోజుల వ్యవధిలో పాలకమండలికి దరఖాస్తులను ఆహ్వానించారు. 90కిపైగా ఆశావహుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మే 15నుంచి 26వరకు సరస్వతీ నదికి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో పాలకమండలిని నియమించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. చైర్మన్, డైరెక్టర్ రేసులో ఉన్న పలువురు ఆశావహులు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శీనుబాబు వద్దకు చక్కర్లు కొడుతున్నారు. చైర్మన్ పోటీలో కాళేశ్వరానికి చెందిన కామిడి శ్రీనివాసరెడ్డి, మంథనికి చెందిన అవధాని మోహన్‌శర్మ ఉన్నారు.

### గ్రామస్థాయిలో వలంటీర్ల నియామకం

భూపాలపల్లి అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో వలంటరీలను నియమించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి ఉచితంగా సేవచేయాలనే గుణం కలిగిన యువతను కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లుగా నియమించనున్నట్లు తెలిపారు. కేసులను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలనే బృహత్తర కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ శ్రీకారం చుట్టిందన్నారు. కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి విలువైన డబ్బులు, సమయాన్ని కోల్పోతున్నారన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు.

# అక్షయ.. అవధాని

- న్యూటన్ గమన నియమాలపై విద్యార్థిని ప్రదర్శన
- భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకే మిరాకిల్ అనిపించేలా..
- ప్రశ్నలకు జవాబులు, ప్రశ్నలు తయారు చేయడం ప్రత్యేకత
- ప్రభుత్వ బడిలో మెరిసిన ఆణిముత్యం

Sunday Special



ప్రతిభను ప్రదర్శిస్తున్న అక్షయ, ప్రశ్నలు సంధిస్తున్న తోటి విద్యార్థినులు

కాళేశ్వరం: ప్రతియేటా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న తీరు ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిచివేస్తున్న తరుణంలో.. అక్షయ పాత్ర లాంటి ఆణిముత్యం తన విజ్ఞాన ప్రదర్శన ప్రతిభతో ఒక్కసారిగా తళుక్కున మెరిసి అందరినీ సర్కారు బడి వైపు చూసేలా చేస్తుంది. అతికష్టమైన భౌతికశాస్త్రం సబ్జెక్టులో తన గైడ్ టీచర్ 'దశావధానం' అనే అంశంపై ప్రోత్సాహం ఇవ్వడంతో తర్ఫీదు తీసుకుంది. తన ప్రతిభకు సానపెట్టి జ్ఞాన సంపదను పెంచుతూ సమాజానికి అందించడానికి ప్రయత్నం చేస్తుంది. మహదేవపూర్ మండలం కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని నాంచర్ల అక్షయ తన ప్రతిభతో సర్కారు బడిపై ఆశలు సన్నగిల్లకుండా పదికాలాలు పటిష్టం చేస్తుంది.



గైడ్ టీచర్ రాజేందర్‌తో అక్షయతో పాటు విద్యార్థినులు



అక్షయ ప్రతిభకు భౌతికశాస్త్రం ఫోరం జిల్లా నాయకుల సన్మానం

### దశావధానం అంటే..

ప్రపంచంలో ఏ భాషకు లేని ప్రత్యేకత తెలుగు భాషకు మాత్రమే ఉంది. దశావధానం, అష్టావధానం, శతావధానం, సహస్రావధానంతో కవులు, రచయితలు తెలుగుభాషకే వన్నె తెచ్చారు. తెలుగు భాషకే పరిమితమై అవధాన ప్రక్రియను భౌతికశాస్త్రంలో చేస్తే ఎలా ఉంటుందని పాఠశాల ఫిజిక్స్ టీచర్ దొనికల రాజేందర్ వినూత్నంగా ఆలోచించి, ప్రయోగం చేశారు. ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడి పిల్లల్లో సృజనాత్మకతను బయటకు తీసుకు రావాలనే ఆలోచనతో భౌతికశాస్త్రంలో న్యూటన్ గమన నియమాలపై తెలుగు దశావదానానికి లింకు కలిపారు. 9వ తరగతి విద్యార్థిని అక్షయ చదువులో రాణిస్తున్న తీరుతో ఆమెపై దృష్టిసారించారు. ఆమెకు భౌతికశాస్త్రంపై పట్టు ఉండడంతో సానపట్టి ఆణిముత్యాన్ని తయారు చేశారు.

### పదిమంది ప్రశ్నలతో..

పదిమంది ప్రశ్నలు వేస్తారు. ఎనిమిది మంది సంబంధిత విషయాలకు సంబంధించిన ప్రశ్నలను సంధిస్తారు. మరో ఇద్దరిలో ఒక్కరు అప్రస్తుత ప్రసంగం చేసి ఆమెను డైవర్ట్ చేస్తారు. మరొకరు సమాధానాలు చెబుతున్న క్రమంలో ప్రశ్నలు తయారు చేయాల్సి ఉంటుంది. వేదికపై కొనసాగుతున్న అంశంపై సంబంధంలేని అంశం చేసి అలర్ట్, డైవర్ట్ చేస్తారు. అప్పటికప్పుడు చతురోక్తులతో కూడిన సమాధానాలు ఇస్తూ అడిగిన ప్రశ్నలకు వెంటవెంటనే సమాధానాలు ఇవ్వడం ప్రత్యేకత.

### న్యూటన్ గమన నియమాలపై ప్రశ్నలు, జవాబులు

- ప్రశ్నకు జవాబు చెప్పడం
- సమాధానాలకు అనువుగా ప్రశ్నలను తయారు చేయడం
- చూపించిన పటంలో దాగున్న న్యూటన్ గమన నియమాన్ని చెప్పడం
- చూపించిన పరికరాలతో ఏ కృత్యం చేయవచ్చునో.. దానిలో దాగున్న నియమాన్ని వివరించడం
- ఇచ్చిన నాలుగు పదాలతో న్యూటన్ గమన నియమాలు అంతర్గతంగా ఉండేలా ఒక కథను చెప్పడం, అందులోని సందర్భాలలో దాగి ఉన్న నియమాలను వివరించడం
- నిర్వహించిన కృత్యంలో గమన నియమాలను వివరించడం
- పెన్ను పేపర్ ఉపయోగించకుండా గమన నియమాల ఆధారంగా ఇచ్చిన వివరాలతో సమస్యను పరిష్కరించడం
- పటాన్ని చూసి శాస్త్రవేత్తను గుర్తించడం
- ఒక పటం లేదా అంశాన్ని గురించి ఏ పేజీలో ఉందో చెప్పడం
- మధ్య మధ్యలో అప్రస్తుత ప్రసంగంతో ఆటంక పరచడం మొదలగు పది అంశాలతో నిర్వహించిన తీరు భౌతికశాస్త్రం ఉపాధ్యాయుల బృందాన్నే సంభ్రమాశ్చర్యంలోకి దించి అబ్బురపరిచింది విద్యార్థిని అక్షయ. ఇటీవల పాఠశాలకు వచ్చిన భూపాలపల్లి భౌతిక శాస్త్రం ఫోరం ఉపాధ్యాయులతో ప్రతిభ ప్రదర్శించి ఔరా అనిపించుకుంది.

### ఐఐటీ సీటు లక్ష్యం



నా గైడ్ టీచర్ రాజేందర్ సార్ ప్రోత్సాహంతో న్యూటన్ గమన నియమాలపై దశావధానం చేసిన. మా హెచ్‌ఎం అన్నపూర్ణ మేడం సహకారం మరువలేనిది. ఆమె నిత్యం చదువుపై శ్రద్ధ, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూస్తుంది. పాఠశాలలోని టీచర్లు మాకు పూర్తి సహకారం అందిస్తున్నారు. భవిష్యత్‌లో ఐఐటీ ముంబయిలో సీటు లక్ష్యంగా చదువుతున్నాను. ప్రభుత్వ బడులపై చిన్నచూపు చూడొద్దు.

- నాంచర్ల అక్షయ, 9వ తరగతి

### సృజనాత్మకత బయటకు తీయాలనే..



ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను బయటకు తీయాలని వినూత్నంగా ఆలోచన చేసిన. దానికి అనుగుణంగా నాకు అక్షయ లాంటి ఆణిముత్యం లభించింది. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్‌డే సందర్భంగా ప్రయత్నం చేసిన. తెలుగు భాషలో కవులు, రచయితలు వాడే దశావధానం లాంటిదే భౌతికశాస్త్రంలో న్యూటన్ మూడో గమన నియమాలపై చేయాలని పట్టుదలతో శిక్షణ ఇచ్చి ప్రదర్శించాం. అద్భుత ప్రదర్శన అమోఘం, అనితర సాధ్యం. ఇలాంటి ప్రదర్శన నాకు తెలిసి ఎవరూ చేయలేదు.

- దొనికల రాజేందర్, ఫిజికల్‌సైన్స్

# ‘సీఎం కృతజ్ఞత సభ’కు సర్వం సిద్ధం



సిద్ధమైన బహిరంగ సభావేదిక



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య, చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, సీపీ సన్‌ప్రీత్ సింగ్, పక్కన డీసీపీ రాజమహేంద్రనాయక్

**నేడు ఘన్‌పూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన**

- రూ.700 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మహిళా సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు..
- వ్యవసాయ మార్కెట్ సమీపంలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య, అధికారులు

జనగామ: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేడు(ఆదివారం) పర్యటించనున్నారు. రూ.700 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, అలాగే ప్రారంభోత్సవాలు చేయనుండగా.. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను సీఎం చేతుల మీదుగా అందజేయనున్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపాన ‘సీఎం కృతజ్ఞత సభ’కు సర్వం సిద్ధం చేశారు. బహిరంగ సభతోపాటు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎంపీ కడియం కావ్య శనివారం పరిశీలించారు.

**శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు**

జఫర్‌గఢ్ మండలం కోనాయచలం సమీపాన రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ స్కూల్(గురుకులం) కాంప్లెక్స్, రూ.146 కోట్లతో ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబు పేట వరకు మెయిన్ కెనాల్ లైనింగ్, రూ.46కోట్ల వ్యయంతో ఘన్‌పూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన 100 పడకల ఆస్పత్రి, రూ.26కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్(ప్రభుత్వ కార్యాలయాల సముదాయం), రూ.50 కోట్లతో పంచాయతీరాజ్ రహదారులు, రూ.26కోట్లతో అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీలు, రూ.250 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల (మొదటి విడత) నిర్మాణ పనులను సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.100కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందజేస్తారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను అనంతరం సీఎం సందర్శిస్తారు. అలాగే ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు మంజూరైన నాలుగు ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తారు. శంకుస్థాపనలకు సంబంధించి సభా వేదిక సమీపంలోనే ఒకే చోట శిలా ఫలకాలు ఏర్పాటు చేశారు. వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

**రెండు రూట్లలో తరలింపు**

సభకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో 50 వేల మందిని తరలించనున్నారు. ఇందుకు సంబంధించి వేలేరు, ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల నుంచి వచ్చే వారు ఘన్‌పూర్ టౌన్ మీదుగా.. జఫర్‌గఢ్, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాల వారు ఇప్పగూడెం మీదుగా రానున్నారు. ఈ రెండు రూట్లలో పోలీసు నిఘా ఉంటుంది. శివునిపల్లి వ్యవసాయ మార్కెట్, విశ్వనాథపురం సమీపంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తుండగా, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాలు నిరంతరం నిఘా ఉంచారు. సీఎం పర్యటన నేపథ్యంలో 850 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టనున్నారు.

**సీఎం టూర్ షెడ్యూల్ ఇలా..**

- మధ్యాహ్నం 12.10 గంటలకు ఇంటినుంచి (హైదరాబాద్‌లో) బయలుదేరి బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.
- 12.25 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు
- 1 గంటకు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లె హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 1.10 నుంచి 1.20 గంటల వరకు ఇందిర మహిళా శక్తి స్టాళ్లను పరిశీలించి, వివిధ గ్రూపులకు కేటాయించిన బస్సులను ప్రారంభిస్తారు
- 1.25 నుంచి 3 గంటల వరకు శివునిపల్లెలో ప్రజాపాలన కార్యక్రమాలు, కృతజ్ఞత సభలో పాల్గొంటారు.
- 3.10 గంటలకు శివునిపల్లె హెలిపాడ్ నుంచి బయలుదేరి 3.45 గంటలకు హెలికాప్టర్‌లో బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.

**‘స్టేషన్’ అభివృద్ధికి రూ.800 కోట్లు**
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటాం**
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

- వివరాలు 8లో

# గోవిందనామ స్మరణ

- మార్మోగిన కోటంచ
- ప్రత్యేక ఆకర్షణగా ప్రభ బండ్లు
- ఘనంగా డోలారోహణం



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు



జాతరలో ప్రభబండ్లు

రేగొండ: కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఏనుగు, గుర్రం, మేక తదితర ప్రభబండ్లను ముస్తాబు చేసి డప్పు చప్పుళ్ల, కోలాటాల భక్తుల నృత్యాల నడుమ స్వామి వారిని దర్శించుకున్నారు. జాతరకు జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, ములుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల మొక్కులలో భాగంగా తలనీలాలు సమర్పించుకుని దర్శనం చేసుకున్నారు. జోగయ్యపల్లి కనుకుంట్ల దేవేందర్ ఇంటి నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను, లింగాల కోసరి వారి ఇంటి నుంచి వచ్చిన ఆండాలమ్మ, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి జాతర ప్రాంగణానికి డప్పువాయిద్యాల నడుమ తీసుకుని వచ్చారు. అనంతరం డోలారోహణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఏనుగు ఆకారం గల ప్రభబండిపై ఊరేగించారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ దంపతులు కోటంచ లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ భిక్షపతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న కాలనీమహిళలు

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధి వేశాలపల్లి శివారు డబుల్‌బెడ్ రూం కాలనీలో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ఖాళీబిందెలతో నిరసన చేపట్టారు. క్వాటర్స్ కేటాయించిన నాటినుంచి ఇప్పటివరకు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, సొంత డబ్బులతో మోటార్లు, పైపులైన్లు ఏర్పాటు చేసుకొని నీటివసతి కల్పించుకున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా అధికారులు తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వేసవికాలం కావడంతో ప్రస్తుతం ఉన్న బోర్లు పనిచేయడం లేదన్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

# టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



గుర్రంపేట పాఠశాల కంప్యూటర్‌ల్యాబ్‌లో..



విద్యార్థికి కరపత్రం అందిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్: పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి.. జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులకు సూచించారు. భూపాలపల్లి మండలం గుర్రంపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం టెన్త్ విద్యార్థులకు కలెక్టర్ ప్రేరణ కరపత్రం పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకుండా రాయాలన్నారు. ఒత్తిడిని జయించినప్పుడే విజయం వరిస్తుందని తెలిపారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ చాలా ముఖ్యమని చెప్పారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నతస్థాయికి చేర్చగలదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంఈఓ లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాబోధన..**

భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాబోధన కార్యక్రమాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృత్రిమ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యాబోధన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యార్థులను చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రక్రియలలో మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంపై ఈ నెల 11న రాష్ట్రస్థాయిలో ఒక రోజు క్వాలిటీ కోఆర్డినేటర్స్, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రాథమిక స్థాయిలో ఏఐ బోధన కార్యక్రమ కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమ అమలుకు ప్రస్తుతం గుర్రంపేట, చింతకాని పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఏఐ క్వాలిటీ కో-ఆర్డినేటర్ కాగితపు లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఏఐ క్వాలిటీ కో-ఆర్డినేటర్ కాగితపు లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి**

భూపాలపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి వివిధ అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసినందున యంత్రాంగం పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కరించాలని సూచించారు. వచ్చే సోమవారం నుంచి ఉదయం 10.30 గంటల నుంచి అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి మండల కేంద్రంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, హాజరు నివేదిక అందజేయాలని స్పష్టంచేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

| ప్రత్యేకతలు | వైద్యులు | తేది - సమయం |
|---|---|---|
| కిడ్నీ వ్యాధులు: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్ర పిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమో డయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు | డా॥ వంశీకృష్ణ నాగళ్ల | 18-03-2025 3వ మంగళవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| కిడ్నీ వ్యాధులు: రోబోటిక్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ల్యాప్రోస్కోపిక్ యూరాలజీ, అడ్వాన్స్‌డ్ ఎండోయూరాలజీ, యూరో-ఆంకాలజీ, ఆండ్రాలజీ మరియు మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ & న్యూరో యూరాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ | [illegible] | 19-03-2025 3వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| క్యాన్సర్‌వ్యాధులకు కన్సల్టేషన్: [illegible] | [illegible] | |
| న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజి వ్యాధులు: [illegible] | [illegible] | |
| కార్డియోథొరాసిక్ కన్సల్టేషన్: [illegible] | [illegible] | |
| ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: [illegible] | [illegible] | 20-03-2025 3వ గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| సంప్రదించవలసిన వారు: మెడ నొప్పి, భుజం కీళ్ల నొప్పి, మోకాలి మరియు తుంటి కీళ్ల నొప్పి, [illegible] | డా॥ అమరనాథ్ రెడ్డి | 21-03-2025 3వ శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

## టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్

- ఈనెల 20 వరకు నామినేషన్ల ప్రక్రియ
- 28న ఓటింగ్..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలకు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి. మనోహర్ శనివారం నోటిఫికేషన్ జారీచేశారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజేషన్ -1, ఆర్గనైజేషన్ -2 (ఉమెన్), రిక్రియేషన్ పదవులకు ఒక్కో పదవికి నోటిఫికేషన్ ఇచ్చారు. మూడేళ్ల పదవి కాలానికి ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం స్క్రూటినీ చేసి ఈనెల 21న నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 22న మధ్యాహ్నం 3గంటల వరకు ఉంటుంది. తుదిగా అభ్యర్థుల జాబితా 22న సాయంత్రం 4. 30 గంటలకు వెల్లడిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు 24న గుర్తులు కేటాయిస్తారు. ఓటింగ్ ప్రక్రియ 28న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజీలో ఉంటుంది. 29న సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, ఈ ఎన్నికల నోటిఫికేషన్‌తో కేయూ టెక్నికల్ స్టాఫ్ ఎంప్లాయీస్‌లో ఎన్నికల సందడి మొదలైంది.

## యూట్యూబ్ విలేకరిపై కేసు

ఖిలా వరంగల్: నిజ నిర్ధారణ లేకుండా ఫొటోలతో సహా సామాజిక మధ్యమాల్లో ఓ కథనం పోస్టు చేసిన ఓ యూట్యూబ్ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఓ యువతి విషయంలో పూర్తి సమాచారం లేకుండా.. కనీసం నిబంధనలు పాటించకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన క్లిప్పింగ్స్ ఆధారంగా సదరు విలేకరిపై శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. శనివారం అతడిని పోలీసులు స్టేషన్‌లో విచారించినట్లు సమాచారం.

## సీకేఎంలో ఫెర్టిలిటీ ఓపీ సేవలు షురూ



ఓపీ విభాగంలో చికిత్సలు అందిస్తున్న డాక్టర్ షర్మిల

ఎంజీఎం: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శనివారం ఫెర్టిలిటీ ఓపీ సేవలను సూపరింటెండెంట్ షర్మిల ప్రారంభించారు. ప్రస్తుతం అందిస్తున్న గర్భిణులకు సేవలతో పాటు సంతాన భాగ్యం లేని దంపతులకు మరింత మెరుగైన ఓపీ వైద్యసేవలందించేందుకు ప్రత్యేక ఓపీ విభాగాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక ఓపీ ప్రారంభించి ఔషధాలు సైతం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈసేవలు ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. సంతాన లేమితో ఇబ్బందులు పడుతున్న దంపతులు.. ఈ విభాగంలో నమోదు చేసుకుని ఉచిత వైద్యసేవలు పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు మురళి, సత్యజిత్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రభల తరలింపులో ఉద్రిక్తత..

- భారీగా తరలిరావడంతో గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్
- నిలువరించే ప్రయత్నంలో పోలీసుల లాఠీచార్జ్
- పరుగులు తీసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు
- ఐదుగురికి గాయాలు, బీఆర్ఎస్ ఆందోళన
- డీసీపీ అంకిత్ రాకతో పరిస్థితి అదుపులోకి..



గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్

సాక్షి, వరంగల్/దుగ్గొండి: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల జాతరకు రాజకీయ ప్రభలు (బండ్లు) తరలుతుండగా దుగ్గొండి మండలం గిర్నిబావిలో ఉద్రిక్త పరిస్థితులు ఎదురయ్యాయి. ఒక్కసారిగా తరలిరావడంతో నిలువరించే ప్రయత్నంలో పోలీసులు లాఠీకి పని చెప్పారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే ప్రభల ఎదుట పేలుస్తున్న షార్ట్ బాణాసంచా బోర్లా పడడంతో రోడ్డు పక్కల వారికి తగిలి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో బాంబుల పేలుడు శబ్దం వినిపించడంతో ఫైరింగ్ జరుగుతుందని భ్రమపడిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల కార్యకర్తలు పరుగులు తీశారు. దీంతో పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయగా పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గాయపడ్డారు. ఒకానొక దశలో ఈ ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు వాటర్ కేనన్ ప్రయోగించబోయారు. చివరకు డీసీపీ అంకిత్ కుమార్ రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. జాతరకు స్వయంగా వాహనాలు, ప్రభలను పంపించారు.

### ఉద్రిక్తతకు ఎందుకు దారి తీసిందంటే..

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహాస్వామి జాతర సందర్భంగా నర్సంపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ప్రభలు శనివారం ఉదయమే గిర్నిబావికి భారీగా చేరుకున్నాయి. కాంగ్రెస్ ప్రభలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించగా, బీఆర్ఎస్ ప్రభలను మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్ ప్రారంభించారు. అయితే ఈ జాతరకు ప్రభలను ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా తరలించాయి. ఏటా గిర్నిబావిలో బల ప్రదర్శన చేయడం పరిపాటిగా మారడంతో పోలీసులు మొదట కాంగ్రెస్ ప్రభలకు ఉదయం 4 నుంచి 11 గంటల వరకు సమయం ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభలు భారీగా తరలిరావడంతో కొమ్మాల ఆర్చ్ నుంచి గిర్నిబావి వరకు బారులుదీరాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభలను దుగ్గొండి, చాపలబండ , నర్సంపేట రోడ్లలో పోలీసులు నిలిపారు. ఇక తమకు కేటాయించిన సమయం దాటి పోయిందని బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుకు చొచ్చుకొచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు ఒకరిపై ఒకరు కుంకుమ చల్లుకోవడం, వాటర్ బాటిళ్లు విసురుకోవడం, పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో పోలీసులు బారికేడ్లు పెట్టారు. అయితే వేలాది మంది ఒక్కసారిగా బారికేడ్లు, చెక్‌పోస్టులు విరగగొట్టి రోడ్డుపైకి రావడంతో ఇరువర్గాలను నిలువరించే క్రమంలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ క్రమంలోనే తొగర్రాయికి చెందిన యార శ్రీనివాస్‌పై పోలీసులు విచక్షణారహితంగా లాఠీలు ఝుళిపించడంతో గాయాలపాలయ్యాడు. కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, సద్ది నర్సిరెడ్డి, మోడెం విద్యాసాగర్, తుమ్మలపెల్లి మహేందర్‌కు అధికంగా లాఠీ దెబ్బలు తగిలాయి. అయితే తమవారిపై ఎందుకు లాఠీచార్జ్ చేశారంటూ మహిళలు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. పరిస్థితి ఇంకా చేజారుపోతుండడంతో వాటర్ కేనన్ ప్రయోగించే ప్రయత్నం చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ తన ఏకే 47 గన్ లోడ్ చేసి ఫైర్ చేస్తానని బెదిరించే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అండగా నిలిచి ధర్నాలో పాల్గొన్నారు. సీఐ సాయిరమణ సర్ది చెప్పే ప్రయత్నం చేయగా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డీసీపీ అంకిత్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



లాఠీచార్జ్ బాధితుల ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఫైర్ చేస్తానంటూ ఏకే. 47 గన్ గురిపెట్టిన నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

### గిర్నిబావి వద్ద కాల్పులు జరగలేదు

- వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

సాక్షి, వరంగల్: కొమ్మాల జాతర సందర్భంగా గిర్నిబావి ప్రాంతంలో ప్రభ బండ్లు వరుస క్రమంలో తరలివెళ్లే సమయంలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించడంతోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆదేశాలను పాటించకుండా ముందుకెళ్లే క్రమంలో పోలీసులకు ప్రభబండ్లను తరలించే వారి మధ్య తోపులాట మాత్రమే జరిగిందని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అంతేకాని ఈ ఘటనలో ఎలాంటి పోలీస్ కాల్పులు జరగలేదన్నారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో ఈ ఘటనలో కాల్పులు జరిగినట్లు ప్రజలను ఆందోళన కలిగించేలా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఆందోళన కలిగించే రీతిలో ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు అప్‌లోడ్ చేసినా, వార్తలు రాసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

### నాలుగు గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం..

ప్రధాన రహదారిపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రభలు నిలిచిపోవడంతోపాటు జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వచ్చే ప్రభలు రెండు వైపులా ఉండడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆర్టీసీ బస్సులను మచ్చాపురం నుంచి దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులకు కొంత ఇబ్బంది తప్పింది.

## ప్రమాదశాత్తు బావిలో పడి యువకుడి మృతి

- కొమ్మాల జాతరలో ఘటన



అరుణ్‌కుమార్(ఫైల్)

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహాస్వామి జాతరలో శుక్రవారం రాత్రి ఓ యువకుడు ప్రమాదశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి భార్య కథనం ప్రకారం.. సంగెం మండలం పల్లార్లగూడ శివారు వీఆర్ఎస్ తండాకు చెందిన వాసరి అరుణ్‌కుమార్(31) తన స్నేహితుడు గుగులోత్ రాజుతో కలిసి కొమ్మాల జాతరకు వెళ్లాడు. జాతరలో భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో ఇద్దరూ కలుసుకోలేక పోగా చీకట్లో దారి తెలియక అరుణ్‌కుమార్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడగా ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ శనివారం తెలిపారు.

## 24 నుంచి దూర విద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24, 26, 28, ఏప్రిల్ 2, 4, 7 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

# 'స్టేషన్' అభివృద్ధికి రూ.800 కోట్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే, ఎంపీ, సీపీ, కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టితో పలు అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలో వ్యవసాయ మార్కెట్ సమీపాన ఆదివారం నిర్వహించనున్న సీఎం బహిరంగ సభా స్థలిని ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్‌లో చేరానని, కేవలం పది నెలల్లోనే సీఎం రేవంత్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేడు శంకుస్థాపన చేసిన వెంటనే పనులను ప్రారంభించి 18 నెలల్లోనే పూర్తి చేయిస్తామన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతగా నేడు 50వేల మందితో 'కృతజ్ఞత సభ' నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

**రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం రేవంత్ : ఎంపీ కావ్య**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రధానంగా వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఏడాదిలోనే రూ.800 కోట్లు మంజూరు చేశారన్నారు.

**సభావేదికను పరిశీలించిన సీపీ..**

సీఎం సభాస్థలి, సభావేదికను వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. సభాస్థలి వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై డీసీపీతో మాట్లాడారు. సీఎం సభ కోసం 800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీలు భీమ్‌శర్మ, అంబటి నర్సయ్య, సీఐలు జి.వేణు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, శ్రావణ్, ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్.నరేందర్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, నీల గట్టయ్య, అంబటి కిషన్‌రాజ్, నీల శ్రీధర్, నీల వెంకటేశ్వర్లు, రాములు, పోశాల క్రిష్ణమూర్తి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు పలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ హామీలను అమలు చేయకుండా నిరంకుశ పాలన సాగిస్తున్నారని, నేడు ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న సీఎం 'కృతజ్ఞత సభ' అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అక్రమంగా సస్పెండ్ చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో కేవలం ఆరు నిమిషాలు మాత్రమే మాట్లాడారని, రైతుల సమస్యలపై ప్రశ్నించిన జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అమానుషమన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతూ నియంతపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీలు మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం కడియం శ్రీహరి నిర్వహించే సభకు ఎలా వస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల కష్టంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి దొడ్డిదారిన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరారని ఎద్దేవా చేశారు. కడియంకు ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సభకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారపాక రవి, ఆకుల కుమార్, మాచర్ల గణేశ్, తాటికొండ సురేశ్, కుంభం కుమార్, బంగ్లా శ్రీను, మునిగెల రాజు, మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేశ్, గుర్రం శంకర్, శ్రీను, గాదె రాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న విరాహత్ అలీ

నయీంనగర్: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు కచ్చితంగా అక్రిడిటేషన్ కార్డులు దక్కేలా తమ సంఘం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గ సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ పాత్రికేయులతో కూడిన కమిటీ నాలుగైదుసార్లు సమావేశమై కొత్త నిబంధనలు రూపొందించిందని, ఈ నేపథ్యంలో అక్రిడిటేషన్ల జారీలో జాప్యమైందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పోరాడుతోందన్నారు. ఇటీవల ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రులకు విన్నవించామని, ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా జేహెచ్ఎస్ ప్రారంభించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, వరంగల్, హనుమకొండ జిల్లాల బాధ్యులు ఎ.రాంచందర్, తోట సుధాకర్, దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, కంకణాల సంతోశ్, పి.వేణుమాధవ్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలు నిర్లక్ష్యం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేస్తే, స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడల అభ్యున్నతికి నిధులు కేటాయిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర 10వ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం కప్ క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారుల్లో నూతనోత్తేజం తీసుకొచ్చామన్నారు. క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం కోసం తామెప్పుడు ముందుంటామన్నారు. టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్. వెంకటేశ్ మాట్లాడుతూ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రం నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. అజీజ్‌ఖాన్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, సాట్ కోచ్ సద్గురు, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ బీఆర్ అంబేడ్కర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్, గోకారపు శ్యాంకుమార్, కోశాధికారి జాహుర్, టెక్నికల్ అఫిషియల్స్ వై. సురేందర్, సలహాదారులు కె. జితేందర్‌నాథ్, జి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేన్ ప్రాంతాన్ని రక్షించుకోవాలి

- వరంగల్ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ అనిశెట్టి శ్రీధర్



కేన్ మొక్కలను పరిశీలిస్తున్న పరిశోధన బృందం

వెంకటాపురం(ఎం): రాష్ట్రంలోనే అరుదైన వృక్ష సంపద మండలంలోని పాలంపేట పరిధిలో ఉందని, కేన్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ అనిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. పరిశోధనలో భాగంగా శనివారం వృక్షశాస్త్ర పరిశోధకుడు, కేన్‌మ్యాన్ ఆఫ్ తెలంగాణ డాక్టర్ సుతారి సతీశ్, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అధ్యాపకురాలు అనంతలక్ష్మితో కలిసి కేన్ ప్రాంతాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఏకైక కేన్ ప్రాంతం పాలంపేటలోనే ఉందన్నారు. కేన్ ప్రాంతంలో 125 జాతుల ఆయుర్వేద మందు మొక్కలు ఉన్నాయని, వివిధ రకాల రోగాలను నయం చేయడానికి వీటిని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. 51 ఎకరాల్లో ఉన్న కేన్ ప్రాంతాన్ని కాపాడుకుని ఆరోగ్య భారత్‌ను నిర్మించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం డాక్టర్ సతీశ్ మాట్లాడుతూ 51 ఎకరాల చుట్టూ ట్రెంచ్ కొట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కేన్ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్ జోన్‌గా ప్రకటించి, కెనోపి వాక్ పేరుతో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో పరిశోధన బృందం సభ్యులు డాక్టర్లు నిఖిత, కృష్ణసాయి, ఆకాశ్, సుమ తదితరులు ఉన్నారు.

## పదవీ విరమణ డబ్బుల పంపకాల్లో కుమారులతో ఘర్షణ

- మనస్తాపానికి గురై రిటైర్డ్ ఉద్యోగి బలవన్మరణం



వీరయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఓ ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ అనంతరం వచ్చిన డబ్బుల పంపకాల విషయంలో కుమారులతో జరిగిన ఘర్షణతో మనస్తాపానికి గురై ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీలో నివాసం ఉండే ఏర్పుల వీరయ్య (63) పంచాయతీరాజ్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఐదేళ్లక్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉద్యోగ విరమణ డబ్బులురాగా ఇటీవల కుమారులకు, ఆయనకు మధ్య పంపకాల విషయంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. వీరయ్య ఈ విషయాలను ఎవరికీ చెప్పుకోలేక తనకు తానుగా బాధపడుతూ వారం రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని వెంకటరమణ లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం లాడ్జి నిర్వాహకులు వీరయ్య మృతిచెందిన విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. టౌన్ ఎస్సై కే.శివ, హెడ్ కానిస్టేబుల్ దామోదర్ సంఘటన స్థలానికి చేరుకుని వీరయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

## ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి

- ఉద్యాన శాఖ వరంగల్ జిల్లా అధికారి సంగీత లక్ష్మి



రైతులకు పసుపు, మిరప విత్తనాలు అందజేస్తున్న ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి

మామునూరు: రైతులు సంప్రదాయ పంటలు కాకుండా ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని ఉద్యాన శాఖ వరంగల్ జిల్లా అధికారి సంగీత లక్ష్మి సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త రాజన్న ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల సంస్థ వరంగల్ సౌజన్యంతో సుగంధ ద్రవ్యాల సాగుపై మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పసుపు, మిరప, కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఉద్యాన పంటల సాగును పంట మార్పిడిగా ఉపయోగించాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్నారు. అంతకు ముందు సుగంధ ద్రవ్యాల పంట సాగు విధానాలపై శిక్షణ పొందిన రైతులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, నాగరాజు, వేణుగోపాల్, హర్షరెడ్డి, సాయిచంద్, సుశ్రాత్, తదితరులు పాల్గొన్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

### REAL ESTATE




### TO-LET

- 2BHK, 5 rooms 11000/-, 1BHK 4 rooms 8000/-, 1BHK 3 rooms 7000/- Sri Sai Colony, Forest Office, Subedari, Hanamakonda. Cell No: 9849596557. [W-1264139]

### SERVICES

- హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 8341479342. [WA-7555]

### FINANCE

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తు లందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1265067]

### సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. D.S.Rao. Cell: 9849145043. [SCA25002056]

### SOLAR ENERGIES

- Orugallu Solar Energies: We provide all Solar Installations House, Commercial purpose with Subsidy. Marketing Persons wanted. G20, KRMS Reddy Complex, Hanumakonda. Cont: Mendu Raghu - 9059700497. [W-1265062]

### AIRTEL XSTREAM

- ఇంటర్నెట్ 40 mbps Unlimited Data + టీవీ చానెల్స్ HD + 20 OTT. డిష్ ఆంటీనా లేకుండా. పల్లె, పట్టణాలలో కూడా. Rs. 2,499/- 3 నెలలు. సెల్: 9989498387. [W-1265065]

### BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

### WANTED

- మా వద్ద పనిచేయుటకు స్త్రీ/పు॥ కావలెను. చదువు అనుభవం అవసరం లేదు Age 30సం॥లోపు వారు జీ. 12K టూ 15K. 9849316058. [SCA25002194]
- Wanted Bolero Car Driver Cum Shop Keeper (Both Works) Sal: 10K - 14K. Age: 30-45 yrs. Sales & Delivery Boys. Cont: Veghan Naturals, IP. Rampur, Kazipet. 9919911016. [WA-6566]
- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002107]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA25002140]
- సాయిరామ్ హోమ్‌కేర్ Hydలో బేబీ & పేషెంట్ కేర్ ముసలివారిని చూసుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంటపనికి ఆడ/మగ కావలెను. జీ: 18 వేలు. 9949094607 [SCA25002181]
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]

### WANTED TEACHERS

- Wanted Teachers for High School Section with B.Ed, & for Primary Section with Graduation, Send your Resume Whatsapp: 9949033066, 9989429744. [WA-485]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

| | |
|---|---|
| హన్మకొండ | 9010144453 |
| వరంగల్ | 9705748198 |
| నర్సంపేట | 9553955722 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్ | 9010144453 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్ భూపాలపల్లి | 9705748198 |

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము